మత సామరస్యానికి ప్రతీకగా

నాగుల చవితి వేడుకలు

- షేక్ ఖాదర్ బాబా



విశ్వంభర, మహబూబ్ బాద్ : మహబూబాబాద్ శివారు ఆరో వార్డులోని బేతోలు గ్రామంలో నాగదేవతకు షేక్ ఖాదర్ బాబా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామ ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు కులమతాలకు అతీతంగా మతసామరస్యాన్ని చాటుతూ, నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని షేక్ ఖాదర్ బాబా నాగదేవతకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా శుక్రవారం రోజున బేతోలు గ్రామ శివారులోని సలార్ తండా సమీపంలో గల ప్రసిద్ధ నాగదేవత ఆలయ పుట్ట వద్ద ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రతి ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లే, ఈ ఏడాది కూడా ఖాదర్ బాబా ఆలయానికి విచ్చేసి నాగదేవత పుట్ట వద్ద పాలు పోసి, దీపాలు వెలిగించి, టెంకాయలు కొట్టి, కానుకలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక గ్రామ ప్రజలతో కలిసి భక్తిపూర్వకంగా నాగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ.. "నాగదేవత ఆశీస్సులతో గ్రామం ఎల్లప్పుడూ సుభిక్షంగా, క్షేమంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలనే సందేశాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు , వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగదేవతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఖాదర్ బాబా ను స్థానికులు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు నీలకంఠ శతకం, రేగుపూల పరిమళాలు పుస్తకాల ఆవిష్కరణ

విశ్వంభర, సిరిసిల్ల : సిరిసిల్ల జిల్లా రాళ్ళరామన్నపేటకు చెందిన రైతు కవి రచించిన నీలకంఠ శతకం మరియు ఎన్టీపీసీ విశ్రాంత మెనేజర్ రేగుల చంద్రయ్య రచించిన రేగుపూల పరిమళాలు పుస్తకాలను ప్రముఖ పద్యకవి, జాతీయ తెలుగు సాహితీ పీఠము అధ్యక్షులు డా.నలవోలు నర్సింహారెడ్డి ఆవిష్కరిస్తారని సంస్థ ప్రధాన కార్యదర్శి వి.యల్ భవాని తెలిపారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన కరీంనగర్ జిల్లాలోని ఫిలిం భవన్ లో నవంబర్ 15 ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు జరిగే సాహిత్య సభకు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాలను ఆవిష్కరిస్తారని, ఈ కార్యక్రమానికి అతిథులుగా ప్రముఖ కవి, ఇన్కమ్ టాక్స్ కన్సల్టెంట్ వేములవాడ ద్రోణాచారి, ప్రముఖ పద్య కవి తిప్పారపు లక్ష్మీనర్సయా చార్యులు, ప్రధాన వక్తలుగా సమైక్య సాహితీ ప్రధాన కార్యదర్శి కె.యస్.అనంతాచార్య,కవి ఉపాధ్యాయులు సామల కిరణ్ కుమార్ లు హాజరవుతారని,కవులు రచయితలు సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

హెచ్ సీ ఎ వన్డే క్రికెట్ లీగ్‌లో

అదరగొట్టిన సిరికొండ కౌశిక్

సెంచరీతో సత్తా చాటిన సలీంనగర్ జట్టు కెప్టెన్



విశ్వంభర, హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వన్డే క్రికెట్ లీగ్‌లో సలీంనగర్ జట్టు కెప్టెన్ సిరికొండ కౌశిక్ అద్భుత సెంచరీతో అదరగొట్టాడు. శుక్రవారం గెలాక్సీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కౌశిక్ 135 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 107 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్‌గా ముందుండి జట్టును నడిపించిన కౌశిక్ తన అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. సలీంనగర్ జట్టు 50 ఓవర్లలో 262 పరుగులు చేయగా, గెలాక్సీ జట్టు 144 పరుగులకే ఆలౌటైంది. దీంతో సలీంనగర్ జట్టు 118 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

ఆలయ నిర్మాణానికి రూ. 51,000 అందించిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి



విశ్వంభర, సరూర్ నగర్ : మహేశ్వరం నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఫేజ్ 3 లో నూతనంగా నిర్మించనున్న కోదండ రామాలయ దేవాలయ నిర్మాణానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుర ఉపేందర్ రెడ్డి రూ 51,000 విరాళంగా అందజేసి తన ఉదార స్వభావాన్ని, దైవభక్తిని, సేవా గుణాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ విజ్ఞప్తికి స్పందించి ఆలయ నిర్మాణానికి పెద్ద మొత్తంలో విరాళం అందించిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ నిర్మాణానికి చేయూతనివ్వడం అంటే ఆధ్యాత్మికతకు, సమాజ ఐక్యతకు బాటలు వేయడం. దైవకార్యంలో భాగస్వామి కావడమే నిజమైన సేవకు నిదర్శనమన్నారు. వారు చూపిన దాతృత్వం అభినందనీయమని అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, కానుగద్ద శ్రీకాంత్, దర్గా శివ యాదవ్, భాస్కర్ యాదవ్, కొత్త రవి, సూర్య, వినోద్, శంకర్, రవి, కౌసల్య, పార్వతీ, భయమ్మ, కవిత పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- అధ్యక్షుడు సునీల్ బాబు

విశ్వంభర, గడ్డి అన్నారం : గడ్డి అన్నారం డివిజన్ లో గల సమస్యల పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తన వంతుకు కృషి చేస్తానని గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దెల సునీల్ బాబు అన్నారు. మైత్రి నగర్ కాలనీలో సెయింట్ స్టానిస్లాస్ చర్చ్ ఎదురుగా గత రెండు రోజులుగా చెత్త పేరుకుపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానికులు తన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి, అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవడం జరిగింది అని తెలిపారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యలైనా నా దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు.





కులం ఎవరి భవిష్యత్తును నిర్ణయించకూడదు



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం, ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సామాజిక న్యాయం అనేది కేవలం ఒక సిద్ధాంతం కాదని, తరతరాలుగా వివక్షకు గురైన వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించే బాధ్యత అని స్పష్టం చేశారు. మాదాపూర్ హెచ్ఐసీసీలోని భారత్ సమ్మిట్-2026లో భాగంగా నిర్వహించిన సామాజిక న్యాయంపై చర్చలో మంత్రి సీతక్క ప్రసంగించారు. తెలంగాణలోని ఒక మారుమూల ఆదివాసీ గ్రామం నుంచి వచ్చి నేడు మంత్రిగా ప్రజల ముందు నిలబడటం తన జీవిత ప్రయాణంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, విద్య, ప్రజాసేవల ఫలితమని తెలిపారు. తనలాంటి గ్రామాల్లో ఎంతోమంది అమ్మాయిలకు ఎన్నో కలలు ఉన్నాయని, కానీ సరైన అవకాశాలు లేక వారి ప్రతిభ వెలుగులోకి రావడం లేదని అన్నారు. ప్రతిభ లేక వెనుకబడటం లేదని, అవకాశాలు అందక వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం అంటే ప్రతి ఒక్కరికీ గౌరవం, ప్రాతినిధ్యం, సమాన అవకాశాలు కల్పించడమేనని, వ్యక్తి విలువను కులం ఆధారంగా నిర్ణయించకూడదని అన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు కేవలం మంచి ఉద్దేశాలు సరిపోవని, విధానపరమైన, నిర్మాణాత్మక మార్పులు అవసరమని పేర్కొన్నారు. ఒక సమాజం సాధించిన అభివృద్ధిని ఆ సమాజంలోని మహిళల పురోగతి ఆధారంగా అంచనా వేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన మాటలను గుర్తుచేశారు. మహిళలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా పారిశ్రామికవేత్తలు, ఉపాధి కల్పించేవారు, నిర్ణయాధికారులు, నాయకులుగా తీర్చిదిద్దాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి భవనాల ద్వారా గ్రామీణ మహిళలకు మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్నామని, మహిళలు అవకాశాల కోసం గ్రామాలను వదిలి వెళ్లకుండా, అవకాశాలే వారి వద్దకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కులగణన సమాజంలో విభజనలు సృష్టించదని, తరతరాలుగా కొనసాగుతున్న అసమానతలను వెలుగులోకి తెస్తుందని మంత్రి సీతక్క అన్నారు. కులగణన అనేది సమాజానికి ఎక్స్‌రే లాంటిదని, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని సమాన అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన నిర్వహించి కులాల వారీగా గణాంకాలను ప్రకటించడం ద్వారా సామాజిక న్యాయం దిశగా ముందడుగు వేశామని, ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కూడా ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రతిపాదిస్తున్న 'జితీ ఆబాదీ ఉత్నా హక్' నినాదం జనాభా ప్రాతిపదికన హక్కులు, ప్రాతినిధ్యం కల్పించాలనే భావనను ప్రతిబింబిస్తుందని అన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తాయని, ప్రాతినిధ్యం వారి గొంతుకకు బలాన్నిస్తుందని, నిర్మాణాత్మక మార్పులే సమానత్వాన్ని సాధ్యం చేస్తాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం మరో తరం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదని, అది భవిష్యత్తులో అందించే హామీ కాదని, ప్రస్తుత తరానికి దక్కాల్సిన హక్కు అని స్పష్టం చేశారు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ చెప్పినట్లు న్యాయం ఆలస్యమైతే అది న్యాయాన్ని నిరాకరించడమేనని గుర్తుచేశారు. దేశమంటే మట్టి కాదని, దేశమంటే మనుషులని గురజాడ అప్పారావు చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ, అభివృద్ధి చివరి గ్రామం, చివరి కుటుంబం, చివరి వ్యక్తికి చేరినప్పుడే నిజమైన అభివృద్ధి అవుతుందని అన్నారు. ఆదివాసీ కుటుంబానికి రహదారి అంటే ఆసుపత్రి, పాఠశాల, మార్కెట్‌కు చేరుకునే అవకాశం అని, ఆదివాసీ బాలికకు విద్య అంటే మెరుగైన భవిష్యత్తుకు తొలి అడుగు అని వివరించారు. గ్రామీణ మహిళకు ఆర్థిక స్వావలంబన అంటే గౌరవం, స్వేచ్ఛ, సొంత నిర్ణయాలు తీసుకునే అధికారం అని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజయాన్ని నగరాల్లో నిర్మించే ఎత్తైన భవనాలతో కాకుండా, అత్యంత వెనుకబడిన ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పుతో కొలవాలని అన్నారు. కులం ఎవరి భవిష్యత్తును నిర్ణయించకూడదని, మహిళ అనే కారణంతో కలలకు పరిమితులు ఉండకూడదని, పేదరికం ఎవరి గౌరవాన్ని దూరం చేయకూడదని స్పష్టం చేశారు. పుట్టింది పల్లెలో అయినా కలలు కనడానికి హద్దులు ఉండకూడదని, ఏ కులంలో పుట్టినా ఎదగడానికి అడ్డంకులు ఉండకూడదని, ఆడపిల్ల అనే కారణంతో ఆశలు ఆగిపోకూడదని అన్నారు.

తన జీవిత ప్రయాణాన్ని వివరిస్తూ పదో తరగతి తర్వాత చదువును ఆపి తొమ్మిది నుంచి పదేళ్ల పాటు ఉద్యమ జీవితాన్ని గడిపానని, అనంతరం తిరిగి విద్యను కొనసాగించానని తెలిపారు. నక్సలైట్ కేసుల విచారణ జరిగిన కోర్టులోనే న్యాయ విద్యను ప్రారంభించి, ఐదేళ్ల తర్వాత అదే కోర్టులో జూనియర్ అడ్వకేట్‌గా అడుగుపెట్టి నక్సలైట్ నాయకుల కేసుల్లో వాదించానని గుర్తుచేశారు. ఒకప్పుడు జూనియర్ అడ్వకేట్‌గా అడుగుపెట్టిన అదే ప్రదేశానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా రావడం తన జీవితంలో మరిచిపోలేని ఘట్టమని అన్నారు. విద్య అనేది ప్రపంచాన్ని మార్చగలిగే అత్యంత శక్తివంతమైన ఆయుధమని నెల్సన్ మండేలా చెప్పిన మాటలను ప్రస్తావించారు.ఒక చిన్న ఆదివాసీ గ్రామం నుంచి ఈ స్థాయికి చేరుకున్న చివరి అమ్మాయిని తాను కావొద్దని, తనలాంటి ప్రయాణాలు సాగించేందుకు లక్షలాది మంది అమ్మాయిలకు అవకాశాలు కల్పించే వారిలో ఒకరిగా ఉండాలనుకుంటున్నానని సీతక్క ఆకాంక్షించారు. అన్యాయాన్ని ఎదిరించే వాడే న్యాయానికి ఆరాధ్యుడని కాళోజీ నారాయణరావు చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పరిస్థితులు ఎవరినీ అణగదొక్కని తెలంగాణను నిర్మించడమే లక్ష్యమని, గొంతు కోల్పోయిన వారికి స్వరం, గౌరవం నిరాకరించబడిన వారికి ఆత్మగౌరవం కల్పించాలని అన్నారు. రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందన్నదే కాకుండా, ఎంతమంది జీవితాలను మార్చగలిగామన్నదే తెలంగాణ రైజింగ్ విజయానికి అసలైన కొలమానమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అభివృద్ధి రాష్ట్రాన్ని సంపన్నం చేస్తే, సామాజిక న్యాయం సమాజాన్ని గొప్పదిగా తీర్చిదిద్దుతుందని అన్నారు.

ఫీజులు ఇవ్వకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

దిల్ సుఖ్ నగర్ లో విద్యార్థుల భారీ నిరసన ర్యాలీ



విశ్వంభర, ఎల్బీనగర్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, లేకుంటే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీశ్ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు ఐదు వేల మంది విద్యార్థులు దిల్ సుఖ్ నగర్ లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన రూ. 8500కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ఏడాది సుమారు 30 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ కు హాజరు కాలేదని లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను, హాస్టల్ మెస్ ఛార్జీలను వెంటనే పెంచాలని కోరారు. విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమ చేయకపోతే, రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు అనంతయ్య, వెంకటేశ్, అంజి, నాయకులు పర్లగోర్ల మోడీరాందేవ్, సిద్దు, రాజేందర్, పృథ్వీ, శివ కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



జి ఎస్ ఐ డివిజన్ సాయి సప్తగిరి కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన కాశి విశ్వేశ్వర స్వామి ఆలయం ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమములో పాల్గొన్న మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ , రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి , మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి. ఈ కార్యక్రమంలో ఎర్ర వినోద్ రెడ్డి,ఆలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మురళి కృష్ణ శంకర్ అరుణా,అమరేష్, సంజీవరెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. (విశ్వంభర, నాగోల్)

ఆర్య వైశ్యుల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తా

- ఉప్పల శ్రీనివాస్ గుప్త



విశ్వంభర, మేడ్చల్ : మేడ్చల్ జిల్లా పరిధిలోని జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీగణపతి భువనేశ్వర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన నూతన చైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు ఈ కార్యక్రమంలో దేవస్థానం శాశ్వత చైర్మన్ చందా నాగభూషణ గుప్త , నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కాచం కైలాసం గుప్త తో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. భక్తి, ఆధ్యాత్మికత, ధార్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గతం లో ఈ దేవాలయం కి లక్ష 11 వేల రూపాయల విరాళం అందజేసినట్లు తెలిపారు. ఆర్య వైశ్యుల అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ కుమార స్వామి, ప్రకాష్, నాగభూషణం, చంద్రశేఖర సతీష్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ ప్రెసిడెంట్ నవీన్ గుప్త, మాజీ చైర్మన్ ప్రవీణ్ గుప్తా, రమేష్ ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయం

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్

విశ్వంభర, సూర్యాపేట : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయం అని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ అన్నారు. సూర్యాపేట పట్టణం లోని 23వ వార్డు లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమం లో భాగంగా మాజీ మంత్రి, శాసనసభ్యులు జగదీశ్ రెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం 23వ వార్డు ఇంచార్జ్ వల్దాస్ స్పందన కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుట్ట కిషోర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థి ని గెలిపించాలని పిలుపు నిచ్చారు. 36 నియోజకవర్గాలు కలసి ఎన్నుకునే ఈ ఎమ్మెల్సీ గెలుపుతో కాంగ్రెస్ పార్టీ పతనం స్టార్ట్ అవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో 7వార్డు కౌన్సిలర్ ఈద ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ లు కస్తాల పద్మ, కళ్లేపల్లి మహేశ్వరి, వల్దాస్ ఉపేందర్, ఏర్పుల కిరీటి, వీర్జల వేణు బలరాం, జ్యోతి, గ్యార శ్రీను, పిట్టల నర్సి, కోడి సైదులు, గండమల్ల యాదగిరి, మధు, వీర్జల శివ, వల్దాస్ రాజు, దండు మహేష్, బొజ్జ ఉపేందర్, పవన్, ఇరుగు నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్ఫూర్తి ప్రదాత కాళోజి నారాయణరావు



విశ్వంభర, చార్మినార్ : దారుల్ షిఫా ప్రభుత్వ బాలుర అందుల పాఠశాల పద్మ విభూషణ్ కాళోజి నారాయణరావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి బహదూర్పుర డిప్యూటీ ఐఓఎస్ కే యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో పుట్టిన కాళోజీ తెలంగాణ లో స్థిరపడి తెలంగాణ ఉద్యమాన్ని తన రచనల ద్వారా ముందుకు నడిపిన గొప్ప స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. కాళోజి యొక్క రచనల్లో అక్షరాలు అనేకమంది నిచైతన్యపరిచాయి అని, ఒక్క సిరాచుక్క లక్ష మెదడులకు కదలిక అనే ఆయన మాటలు ఎంతోమందికి స్ఫూర్తినిచ్చాయి అని అన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాళోజి తన జీవితంలో చేసిన సేవలను గుర్తు చేశారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాములు మాట్లాడుతూ కాళోజి ఒక ఉద్యమ కవి అని ప్రజాకవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండగల చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం



విశ్వంభర, మాడుగుల పల్లి : నల్గొండలో చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 23547 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. దాదాపు నల్గొండ నియోజకవర్గంలో 80 వేల మందికి పైగా లబ్ధి పొందాలని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, గీత కార్మికులు ,ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా ఈ పింఛన్లు కేవలం ఆర్థిక సహాయం కాకుండా ఆత్మగౌరవంతో జీవించడానికి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందజేయడం జరిగిందని తెలిపారు. ఇందుగల గ్రామంలో 26 మందికి లబ్ధి చేకూరడం జరిగిందని గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా విశ్వంభర
"విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108